క్లుప్తంగా

బాక్సింగ్‌లో శైనీశ్రీకి కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన శైనీశ్రీ

బీచ్ రోడ్డు: అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల బాక్సింగ్ పోటీల్లో తక్షశిల ఐఏఎస్ అకాడమీ విద్యార్థిని శైనీశ్రీ కాంస్య పతకం సాధించారు. మొహాలిలో డిసెంబర్ 29 నుంచి జనవరి 1 జరిగిన 54–57 కేజీల విభాగం పోటీల్లో కాంస్య సాధించిన ఆమెను సంస్థ నిర్వాహకుడు జి.సాయిరాం అభినందించారు.

పండ్లు, ఔషధ మొక్కలు నాటండి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పండు, ఔషధ మొక్కలను విరివిగా నాటాలని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ కోరారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏయూ సోషల్ వర్క్ విభాగంలో మొక్కలు నాటారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విరివిగా మొక్కలను నాటాలని హరనాథ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులంతా పర్యావరణ పరిక్షణ దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విరబూసిన ఆర్కిడ్


ఉద్యానవనంతో విరబూసిన ఆర్కిడ్

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనంలో ఫాక్స్‌టైల్ ఆర్కిడ్ విరబూసింది. తెల్లని పుష్పాలతో మంగళవారం కనువిందు చేసింది. అరుదైన ఆర్కిడ్ జాతుల మొక్కలను సేకరించి ఇక్కడ పెంచుతున్నారు. ప్రత్యేకమైన వాతావరణాన్ని వాటికి కల్పించి సంరక్షిస్తున్నారు. అందమైన పుష్పాలతో ఇవి అరుదుగా కనువిందు చేస్తుంటాయి. వీటిని వీక్షించడానికి పెద్ద సంఖ్యలో నగరవాసులు వస్తున్నారు.

కల్యాణం.. కమనీయం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

10 నుంచి గీతం ఎక్స్‌లెన్స్ మీట్

కొమ్మాది: వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతోపాటు ఆటు క్రీడలు, సాంస్కృతిక నైపుణ్యాలు వెలికితీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ రెండు రోజులపాటు నిర్వహించే గీతం ఎక్స్‌లెన్స్ మీట్ – 2024 ఈ నెల 10, 11న నిర్వహిస్తున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా ఈ ఎక్స్‌లెన్స్ మీట్‌ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని, ఎందరో విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచిందన్నారు. ఈ ఏడాది కర్తవ్య పేరిట మీట్ నిర్వహిస్తున్నామన్నారు.

మన కోసం.. మనతో..

- ఏయూ వేదికగా విస్తృతంగా స్టూడెంట్స్ క్లబ్స్ సేవలు
- సాంకేతికత నుంచి సాంస్కృతికం వరకు నిర్వహణ
- మార్గదర్శకత్వం అందించి నడిపిస్తున్న ఆ–హబ్

ఏయూ క్యాంపస్: నేటి తరం విద్యార్థులు తరగతి గదికి, పుస్తకాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. వారిచుట్టూ ఉన్న సమాజాన్ని ఆకళింపు చేసుకుంటున్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము మలుచుకుంటున్నారు. ఈ ప్రక్రియలో అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి కళాశాలలో స్టూడెంట్ క్లబ్స్ ఏర్పడుతున్నాయి. ఒక్కో ప్రత్యేక అంశాన్ని ఎంపిక చేసుకుని వారు తమ సహచర విద్యార్థులను నిష్ణాతులుగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థులంతా తమ కోసం.. తామే అన్నీ అయి వీటిని నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రం ఆ–హబ్ వీరికి అవసరమైన మార్గదర్శకం అందిస్తూ ముందుకు నడిపించడం మరో విశేషం. గత నాలుగు సంవత్సరాల కాలంలో ఏయూలో 8 విద్యార్థి క్లబ్‌లు ఏర్పాటు అయ్యాయి. ఇవి ఎంతో ప్రభావంతంగా పనిచేస్తున్నాయి. వీటిపై ఓ లుక్కేద్దాం..


కోడియం సభ్యులు

ఏయూ యునైటెడ్

విద్యార్థులందరినీ ఐక్యం చేసే విధంగా ఏయూ యునైటెడ్ పనిచేస్తోంది. కాలేజ్ కల్చరల్ ఫెస్ట్‌లు, టెక్నికల్ ఫెస్ట్‌ల నిర్వహణ బాధ్యత ఈ సభ్యులు చేపడతారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్, గేమ్స్, క్రీడలు, ఫొటోగ్రఫీ వంటివి మిళితం చేస్తూ వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, మ్యూజిక్, డ్యాన్స్ ఈవెంట్‌లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు.

జీడీఎస్

గూగుల్ సాంకేతికతలను విద్యార్థులకు పరిచయం చేయడం లక్ష్యంగా 400 మందికి పైగా సభ్యులు పని చేస్తున్నారు. వర్క్‌షాప్‌లు, వెబ్ డెవలప్‌మెంట్, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీతో పాటు అధునాతన ఫ్లటర్ టెక్నాలజీలను సైతం విద్యార్థులకు పరిచయం చేసే దిశగా కృషి చేస్తున్నారు.

హల్ట్ ప్రైజ్ బృందం

సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయంతో ప్రపంచ వ్యాప్తంగా ఎదురయ్యే ముఖ్యమైన సవాళ్లకు పరిష్కారం చూపే యువతను ప్రోత్సహించే విధంగా హల్ట్ ప్రైజ్ నిలుస్తుంది. దీనికి అవసరమైన మార్గదర్శకం అందించే విధంగా విద్యార్థుల బృందం పని చేస్తోంది.

కోడియం... కోడ్ ఐ యామ్....

ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ క్లబ్‌లో 850 మంది సభ్యులుగా చేరారు. విద్యార్థుల్లో కోడింగ్ పట్ల ఆసక్తి, సామర్థ్యాలను పెంచడం లక్ష్యంగా కోడియం పని చేస్తోంది. క్యాంపస్‌లో, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాక్‌థాన్‌లో ఏయూ విద్యార్థులను ప్రోత్సహించడం, మార్గదర్శకం అందించడం లక్ష్యంగా కృషి చేస్తోంది. సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, డ్రోన్ టెక్నాలజీ, వెబ్, యాప్ డెవలప్‌మెంట్, ఏఆర్, వీఆర్ వంటి అంశాలలో పని చేస్తున్నారు. ప్రతి వారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కోడింగ్‌పై సదస్సులను నిర్వహిస్తున్నారు. నిపుణుల జ్ఞానాన్ని పంచుకోవడం, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతలపై అవగాహన కల్పిస్తున్నారు.

బిజ్ హబ్..

ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో చదువుతున్న విద్యార్థులు బిజ్ హబ్ క్లబ్‌ని స్థాపించారు. దీనిలో 300 మందికి పైగా విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, స్టార్టప్‌ల సంఖ్య పెంచడం లక్ష్యంగా పనిచేస్తోంది. ఇప్పటికే విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించి తమదైన ముద్ర వేసుకున్నారు.

మ్యాథ్స్ క్లబ్.. పయనీర్స్ క్లబ్..

ఇంజినీరింగ్ విద్యార్థులకు మ్యాథ్స్ ఒక బ్రహ్మ పదార్థంగా ఉండటం సహజం. అదే విధంగా కోడింగ్ ఎంతో అవసరం. కోడింగ్‌లో ప్రతిభ చూపాలంటే మ్యాథ్‌మెటిక్స్ స్కిల్స్ ఎంతో అవసరం. విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని తొలగించడం, గణితాన్ని ఒక ఆటగా మార్చడం లక్ష్యంగా ఈ క్లబ్ పనిచేస్తోంది. దీనిలో 400 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ట్రెజర్ హంట్, వర్క్‌షాప్‌లు వంటివి నిర్వహించారు. త్వరలో అంతర్జాతీయ గణిత సదస్సును నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.

ఈ–4 క్లబ్...

ఎంగేజ్, ఎంతూస్, ఎమర్జ్, ఎవాల్వ్ అనే నినాదంతో విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దిశగా నడిపించడానికి ఈ–4 క్లబ్ పనిచేస్తోంది. ఈ క్లబ్‌లో 360 మంది సభ్యులు ఉన్నారు. ఆలోచనల నుంచి వ్యాపార సంస్థల దిశగా నడిపించడానికి వీరంతా పని చేస్తున్నారు. డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్, ఐడియాథాన్‌లు ప్రతి నెలా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా మూడు కార్యక్రమాల నిర్వహణ లక్ష్యంగా క్లబ్ పనిచేస్తోంది.

ఆటలతో ఆంగ్ల భాషపై ప్రావీణ్యం

ఇన్ఫోటైనమెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ప్రతి రెండు వారాలకు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్ లిటరేచర్, స్టోరీస్ వంటి కార్యక్రమాలు ఈ క్లబ్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేక అంశాలపై డిబేట్‌లు, ట్రెజర్ హంట్, పజిల్స్ సాల్వ్ చేయడంతో పాటు ఆటలతో ఆంగ్ల భాష ప్రావీణ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నారు.


కమ్యూనికాన్ సభ్యులు

నవరత్నాలతో సంక్షేమ బాట

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 11వ వార్డులో ఉత్సాహంగా పాదయాత్ర

అరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో ప్రజలను సంక్షేమ బాట పట్టించారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 11వ వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, పార్టీ స్థానిక నాయకులతో కలిసి 18, 30 నంబర్ల సచివాలయాల పరిధిలోని బాలాజీనగర్, అన్నానగర్, తోటగరువు, గాంధీనగర్‌లలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ లబ్ధిదారులు సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా ప్రజలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందుకే ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాలాజీనగర్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

అప్పుఘర్‌లో మున్సిపల్ కార్మికుల నిరసన

ఎంవీపీ కాలనీ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అప్పుఘర్‌లో మంగళవారం జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పారిశుధ్య పనులను పోలీసుల పర్యవేక్షణలో ప్రైవేట్ వ్యక్తులతో చేయించడాన్ని అడ్డుకున్నారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు నిరసన కొనసాగుతుందంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. అనంతరం ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని ఎంవీపీ స్టేషన్‌కు తరలించారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

సీతమ్మధార : విశాఖలో జరిగిన సామూహిక లైంగిక దాడి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కె.పద్మ మాట్లాడుతూ ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన లైంగిక దాడి ఘటనలో నిందితులను శిక్షించాలని, లైంగిక దాడి సమయంలో పోలీసులు బాలిక ఫోన్ ట్రాక్ చేసి ఉంటే నేర తీవ్రత తగ్గి ఉండేదని అన్నారు. మధురవాడలో ఒక మైనర్ బాలిక అత్యాచారం వెలుగులోకి వచ్చిందని అన్నారు. విశాఖలో అత్యాచార సంస్కృతి బాగా పెరిగిందన్నారు. ముద్దాయిలపై చార్జిషీట్ వేసి శిక్ష పడేలా ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బీచ్ రోడ్డులో బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా పెట్రోలింగ్ జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మహిళా చేతన సభ్యులు

సభ్యుల సంక్షేమానికి కృషి

సీతంపేట: విశాఖ పోర్టు ట్రస్టు మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షిక సమావేశం మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డీ మాట్లాడుతూ సంఘంలో 110 మంది వరకు సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారని, కొత్తగా మరికొంత మంది చేరారన్నారు. సభ్యుల సంక్షేమం కోసం ఒకరికొకరు సాయం చేసుకోవాలన్నారు. 2023–24 సంవత్సరంలో సంఘం చేపట్టిన సభ్యుల సంక్షేమ కార్యక్రమాలు, గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌లో సభ్యుల సేవల కోసం ఏర్పాట్లు, కొత్త సభ్యుల చేరికలు వివరించారు. 2024 సంవత్సరంలో చేపట్టనున్న కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.ఎస్.ఆర్. గుప్తా, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డీ

స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద బంగారు చైను లభ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు (పీపీ గేటు) వద్ద బంగారు చైను లభ్యమైంది. సరైన రుజువులతో వస్తే దానిని యజమానికి అప్పగిస్తామని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు. వివరాలివి.. గత నెల 14న 'ఎ' షిఫ్ట్‌లో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ ఎం.కె. అజిత మెయిన్ గేటు వద్ద ద్విచక్ర వాహనాల ఐడీ తనిఖీ విధులు నిర్వర్తిస్తుండగా.. ఉదయం 10.30 గంటల సమయంలో గేటు సమీపంలో బంగారు చైను పడి ఉండటాన్ని గమనించారు. ఆమె తమ ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు ఉక్కు అధికారులకు సమాచారం ఇచ్చారు. గత నెల 17 వరకు గొలుసు కోసం ఎవరూ రాకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు అందజేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు చైను నాణ్యత తనిఖీ చేయించగా చేయగా 14.730 గ్రాముల బరువు ఉందని, రూ.80 వేలు విలువ ఉంటుందని ధ్రువీకరించారు. సదరు చైను పోగొట్టుకున్నవారు సరైన ఆధారాలు చూపిస్తే, వారికి అందజేస్తామని హెడ్ కానిస్టేబుల్ మంగతాయారు తెలిపారు.

హక్కులపై అవగాహనతోనే మహిళలకు రక్షణ

ఏయూ క్యాంపస్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నప్పుడే మహిళలకు రక్షణ సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. మంగళవారం మహారాణిపేట మహిళా అతిథి గృహంలో డాక్టర్ దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, వుమెన్ గ్రీవెన్స్ సెల్, ఐసీసీ అంతర్గత ఫిర్యాదు కేంద్రం సంయుక్తంగా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ముందుగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని, తద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి పోరాటాన్ని నడిపించిన దుర్గాబాయి దేశముఖ్ జీవితం నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు.


దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ 1987లో ప్రారంభించిన ఈ కేంద్రం మహిళల ప్రగతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటూ ప్రతిభతో రాణించాలన్నారు.

దిశ మహిళా పోలీస్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి గణపతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు ఎక్కువ సమయం వెచ్చించకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ దిశ చట్టం వల్ల మహిళలకు ఉపయోగాలు, సమస్యలు వచ్చిన సందర్భంలో స్పందించే విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, ఆర్ట్స్ కళాశాలలకు చెందిన పీజీ విద్యార్థులు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్‌లో కణుజు హల్‌చల్


విశాలాక్షినగర్‌లో కణుజుకు ఆహారం పెడుతున్న స్థానికుడు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో మంగళవారం ఓ కణుజు హల్‌చల్ చేసింది. సీతకొండ నుంచి జనారణ్యంలోకి చేరింది. వీధుల్లో చెంగుచెంగున గెంతులేస్తూ పరుగులు తీసింది. దీంతో స్థానికులు కొందరు దాన్ని చూసి భయంతో పరుగులు తీశారు. ఇంకొందరు దానికి ఆహారం పెట్టారు. దీనికి మెలితిరిగి ఉన్న పదునైన కొమ్ములను చూసి దాడి చేస్తోందని భావించి దూరంగా ఉన్నారు. కణుజు కొంతసేపు వీధుల్లో తిరిగిన అనంతరం మళ్లీ సీతకొండల్లోకి జారుకుంది.

కాల భైరవ హోమం నేడు

సీతంపేట: బహుళ అష్టమి సందర్భంగా బుధవారం సాయంత్రం 6:30 గంటలకు శ్రీ లలితాపీఠంలో కాలభైరవ హోమం జరిపిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. గురువారం ఉదయం 9:30 గంటలకు చండీహోమం జరుగుతుందన్నారు. మాసశివరాత్రి సందర్భంగా 10వ తేదీ సాయంత్రం కాళీ కాలభైరవులకు అమృత అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, అమావాస్య సందర్భంగా 11వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ ప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందని తెలిపారు. పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళా పద్మారాధనలో సిరులతల్లి


నాదస్వర కచేరీ చేస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 20వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాదస్వర కచేరీ..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నాదస్వర కచేరీ నిర్వహించారు. కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు.

6న రథయాత్ర

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసంలో ప్రతి ఏటా నిర్వహించే కనకమహాలక్ష్మి అమ్మవారి రథోత్సవ కార్యక్రమం ఈ నెల 6న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా ఆలయం వరకు రథోత్సవం సాగనుంది.

బీచ్ సందర్శకులను ఇబ్బంది పెడితే చర్యలు

బీచ్ రోడ్డు: బీచ్‌కు వచ్చే సందర్శకులను ఇబ్బంది పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ రామారావు హెచ్చరించారు. మంగళవారం బీచ్‌లో ఉన్న ఫొటోగ్రాఫర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కొంత మంది ఫొటోగ్రాఫర్లు సందర్శకుల అనుమతి లేకుండా ఫొటోలు తీసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, మరికొంత మంది స్నానాలు ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే అటువంటి చర్యలు నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొద్ది మంది ఫొటోగ్రాఫర్లు సందర్శకులకు అండగా ఉంటూ వారికి సహాయ పడుతున్నారని, వారిని చూసి మిగతా వారు కూడా అటువంటి ప్రవర్తన అలవాటు చేసుకోవాలని హితవుపలికారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీ ఆదాయం రూ.1.22 లక్షలు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి హుండీ ద్వారా రూ.1,22,497 ఆదాయం లభించిందని ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ మొత్తం రెండు నెలలకు గాను లభించినట్లు చెప్పారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఇన్స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, ధర్మకర్తలు లక్ష్మీకాంతం, చంద్రకళ, శ్రీహరి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో రమాబాయ్, చైర్‌పర్సన్ విజయలక్ష్మి